

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు



| జిల్లా | ప్రాంతం | ఉష్ణోగ్రత (డిగ్రీల్లో) |
|---|---|---|
| వికారాబాద్ | మోమిన్‌పేట్ | 8.7 |
| రంగారెడ్డి | మంగల్‌పల్లి | 10.1 |
| మేడ్చల్ | మూడుచింతలపల్లి | 11.6 |



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ

# నషా ముక్త్ భారతే లక్ష్యం

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతీ పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, వాటిబారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోరాదని కలెక్టర్ ప్రతీక్‌జైన్ పిలుపునిచ్చారు. మంగళవారం అనంతగిరిపల్లి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలుర) పాఠశాల - కళాశాలలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం మిమ్మల్ని ఆరోగ్య వంతులుగా చూడాలంటే మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని సూచించారు. తల్లిదండ్రులు ఎంత కష్టపడి చదివిస్తున్నారన్న విషయం గుర్తుంచుకుని మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం యువతలో అవగాహన పెంపొందించాల్సిన ఆవశ్యకతపై దృష్టి సారించారన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకూడదని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత డ్రగ్స్ రహిత జీవన శైలి కోసం ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వారి వివరాలు అధికారులకు తెలియజేస్తామని విద్యార్థులు ప్రమాణం చేశారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహారావు సిబ్బంది పాల్గొన్నారు.


## భూ సమస్యల పరిష్కారానికి కృషి

» అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



రికార్డులను పరిశీలిస్తున్న లింగ్యా నాయక్

కోట్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. మంగళవారం కోట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులల్లోని పహాని, సాదాబైనామా, రెవెన్యూ సదస్సుల పురోగతిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కార్యాలయాలకు వచ్చే ప్రతి రైతు సమస్యను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కిరణ్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ యూనూస్, సిబ్బంది జ్ఞాన సాయి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.




త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పల్లెల్లో మళ్లీ రాజకీయ సందడి మొదలైంది. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు, సుప్రీం కోర్టు తప్పు పట్టిన సంగతి తెలిసిందే. దీంతో మళ్లీ పాత రిజర్వేషన్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. సోమవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత పంచాయతీ, తరువాత పరిషత్ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది.

# పల్లెల్లో మళ్లీ సందడి

## స్థానిక ఎన్నికలకు సర్కార్ సన్నాహాలు

**మారనున్న రిజర్వేషన్లు**

మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా పాత విధానంలోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే పంచాయతీ ఎన్నికలను ముందుగా నిర్వహిస్తుండటంతో ఇటీవల సర్పంచ్, వార్డులకు ప్రకటించిన రిజర్వేషన్లన్నీ మళ్లీ మారనున్నాయి. కాగా, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశంపై కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చాకే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించింది.

- మొదట పంచాయతీ.. ఆ తర్వాతే ప్రాదేశికం
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు
- రెండు విడతల్లో జరగనున్న ఎలక్షన్స్
- అధికార యంత్రాంగం సన్నద్ధం
- డిసెంబరు రెండో వారంలో షెడ్యూల్ విడుదలకు అవకాశం

**వికారాబాద్ జిల్లా**

పంచాయతీలు 594

వార్డులు 5,058

**ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| గ్రామీణ ఓటర్లు | 6,98,472 |
| పురుషులు | 3,43,668 |
| మహిళలు | 3,54,788 |
| ఇతరులు | 16 |

వికారాబాద్, నవంబరు 18 (ఆంజ్యోతి ప్రతినిధి): సుప్రీం కోర్టు సూచనల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా పాత విధానంలోనే మళ్లీ పంచాయతీ ఎన్నికలకు వెళాల్సి రావడం కాంగ్రెస్ సర్కార్‌కు కొంత ఇరకాటంగానే మారింది. దీన్ని అధిగమించేందుకు పార్టీలతో సంబంధం లేకుండా జరిగే పంచాయతీ ఎన్నికలను ముందు నిర్వహించాలని సర్కార్ నిర్ణయించింది. ఇదిలా ఉంటే బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశంపై కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చాకే ప్రాదేశిక ఎన్నికలపై తదుపరి నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించింది. అపుడు కూడా న్యాయస్థానాల్లో వ్యతిరేకంగా తీర్పులు వస్తే పార్టీ పరంగా 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ భావిస్తోంది. పంచాయతీ ఎన్నికలకు ముందుగా ప్రభుత్వం తాము చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

### పథకాలపై విస్తృత ప్రచారం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబరు ఒకటి నుంచి 9వ తేదీ వరకు ప్రజా పాలన వారోత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు ఆకర్షించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో

మిగతా 7వ పేజీలో...

## 23న మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



వికారాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసిందని డీఈవో రేణుకాదేవి తెలిపారు. 23వ తేదీన జరగనున్న ఈ పరీక్ష కోసం జిల్లాలో మొత్తం 5 కేంద్రాలు ఏర్పాటు చేయగా, వికారాబాద్ జిల్లా కేంద్రంలో మూడు, తాండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ పాఠశాల హెచ్‌ఎంలను సంప్రదించి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల వెంట ఒక ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జిగా నియమించాలన్నారు. పరీక్ష నిర్వహణ కోసం అన్ని ఏర్పాటు చేశామని, అయిదుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, అయిదుగురు డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించినట్లు ఆమె చెప్పారు.



ఆ సీఐలపై
## అటాచ్ వేటు!

- తాండూరు రూరల్ పీఎస్‌లో సమన్వయ లోపం
- ఆరోపణల నేపథ్యంలో ఐజీ కార్యాలయానికి సరెండర్

7



## సీత్లా సందడి

తమ ఆరాధ్య దైవం సీత్లా అమ్మవారి బోనాల ఉత్సవాన్ని పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో మంగళవారం బంజారాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో కోలాహలంగా వచ్చి సీత్లా అమ్మవారికి సమర్పించారు. ఈ ఉత్సవంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, నాయకులు మందడి సురేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, బంజారా సంఘం ప్రతినిధులు, మహిళలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

-ఘట్‌కేసర్, నవంబరు18(ఆంధ్రజ్యోతి)

## ఘనం.. కార్తీక దీపోత్సవం





ధారూరు వీరభద్రేశ్వర ఆలయంలో మంగళవారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆలయంలో వివిధ ఆకారాల్లో దీపాలను వెలిగించారు. ఆలయ పూజారులు చెన్న బసవయ్య స్వామి, కుమార స్వామిలు కార్తీక దీపోత్సవానికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

-ధారూరు, నవంబరు18(ఆంధ్రజ్యోతి)



బిల్వ పత్రాలతో శివ పూజ చేస్తున్న భక్తులు

ఘనంగా మాసశివరాత్రి
## పూజలు

కీసర రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మాసశివ రాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని రుద్ర హోమం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శివలింగానికి ఎదురుగా ఉన్న నందీశ్వరుని పంచామృతాలతో అభిషేకించి, విశేషంగా అలంకరించారు. అలాగే ప్రదోష కాల సమయంలో మూలవిరాట్‌కు బస్మాభిషేకం నిర్వహించి బిల్వ పత్రాలతో అర్చన చేశారు. అనతరం అర్చకులు భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేసారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ నారాయణశర్మ, ఈట సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ దాడులు.. అధికారుల బెంబేలు!

## రిజిస్ట్రార్ కార్యాలయాలపై వరుస దాడులు

- తనిఖీల్లో వెలుగులోకి విస్తుపోయే నిజాలు
- భయాందోళనలో సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్లు
- కార్యాలయాలకు వెళ్లేందుకు జంకుతున్న రైటర్లు
- మేడ్చల్ జిల్లాలో 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు



మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు(ఫైల్)

మేడ్చల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ వరుస దాడులతో అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అన్ని కార్యాలయాల్లోనూ డాక్యుమెంట్ రైటర్లదే హవా. అన్ని కార్యాలయాల నుంచి ఫిర్యాదులు వస్తుండటంతో ఏసీబీ అధికారులు వారం రోజులుగా వరుసగా దాడులు నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సిబ్బందితో పాటు పలువురు డాక్యుమెంట్ రైటర్ల ఆదాయాలపై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై లోతుగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. దీంతో డాక్యుమెంట్ రైటర్లతో పాటు సబ్ రిజిస్ట్రార్లు సైతం బెంబేలెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో డాక్యుమెంట్ రైటర్లు తమ కార్యాలయాలకు సైతం వచ్చేందకు జంకుతున్నారు. డాక్యుమెంట్ రైటర్ల దోపిడీపై ఫిర్యాదుల నేపథ్యంలో వరుస తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీల సమయంలో డాక్యుమెంట్ రైటర్లను

మిగతా 8వ పేజీలో...

### కోట్లకు పడగలెత్తుతూ..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని భూముల విలువ రాష్ట్రంలోనే అధికంగా ఉండటంతో పెద్ద మొత్తంలో లావాదేవీలు జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్ రైటర్లు చిన్న చిన్న సాకులను బూచిగా చూపి పెద్ద మొత్తంలో గుంజుతున్నారనే ఆరోపణలున్నాయి. సబ్ రిజిస్ట్రార్లకు కూడా అందులో వాటా అందుతున్నట్లు సమాచారం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు ఏకమై ఇదంతా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అల్వాల్‌కు చెందిన ఓ డాక్యుమెంట్ రైటర్ ఏకంగా వంద కోట్ల వరకు అక్రమంగా సంపాదించినట్లు ప్రచారంలో ఉంది. డాక్యుమెంట్ రైటర్లు చేరిన వారు సంవత్సర కాలంలోనే ఖరీదైన కార్లలో తిరుగుతున్నారంటే వారి ఆదాయం ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం ఇప్పటికే పెద్ద ఎత్తున మార్పులు తీసుకువచ్చింది. ఆన్‌లైన్ విధానంలో స్లాట్ బుకింగ్ కూడా అమలులోకి తీసుకువచ్చింది. అయినప్పటికీ డాక్యుమెంట్ రైటర్ల దోపిడీని మాత్రం నియంత్రించలేకపోతున్నారు. డాక్యుమెంట్‌తో సబ్ రిజిస్ట్రార్ వద్దకు నేరుగా వెళ్తే ఏవో సాకులు చూపుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయించాల్సి వస్తున్న పరిస్థితి.

# యువతే దేశ భవిష్యత్తు

» డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి

వికారాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువతే దేశ భవిష్యత్తు అని యుక్త వయస్సులో కొంత మంది చెడు సాహవాసాలతో జీవితాలను పాడు చేసుకుంటున్నారని డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ 2025లో భాగంగా కార్యక్రమంలో నిర్వహించి మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఫ్యాషన్ కోసమో, ఆసక్తి వలనో మద్యం సేవించడం, పొగ తాగడం, మత్తు పదార్థాలను తీసుకోవడం ఆందోళనకరమని అన్నారు. అవి అలవాటై వ్యసనాలుగా మారితే విద్యలో వెనుకబడి పోవడం, మానసిక, శారీరక ఆరోగ్యాలపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు కుటుంబాల్ని చిన్నాభిన్నం చేస్తాయని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, చెడు ప్రభావాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌ను పూర్తిగా దూరం పెట్టాలన్నారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, డాక్టర్ కృప, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు

» మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి వెంకట్



మక్క బస్తాలను పరిశీలిస్తున్న వెంకట్

పరిగి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మక్కలను విక్రయించి మద్దతు ధర పొందాలని మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి వెంకట్ సూచించారు. మంగళవారం పరిగిలోని డీసీఎమ్మెస్‌లోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓపెన్ మార్కెట్‌లో మొక్కజొన్నలకు మద్దతు ధర లేదని, ప్రభుత్వ కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. రైతులు అమ్ముకున్న వారం రోజుల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## జిన్నింగ్ మిల్లుల బంద్ విరమణ

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిబంధనలను సడలించేందుకు ముందుకు రావడంతో తమ జిన్నింగ్ మిల్లుల బంద్‌ను విరమిస్తున్నట్టు మంగళవారం తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయించింది. సీసీఐ లీజుకు తీసుకున్న మిల్లులన్నీ ఓపెన్ చేయాలని, రైతు నుంచి ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాలని, రైతు ఎక్కడైనా విక్రయించుకునే స్వేచ్ఛ ఇవ్వాలన్న డిమాండ్లతో యాజమాన్యాలు సోమవారం నుంచి నిరవధిక బంద్‌కు పూనుకున్న విషయం తెలిసిందే. దీంతో మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్‌రావు, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్, కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రమేష్ హైదరాబాద్ సెక్రటరియేట్‌లో సమావేశమై, సమస్యలపై చర్చించారు. చర్చలు సఫలం కావడంతో బుధవారం నుంచి సీసీఐ పత్తిని అన్‌లోడ్ చేసుకుని, జిన్నింగ్ చేస్తామని షాద్‌నగర్ రాఘవేంద్ర కాటన్ జిన్నింగ్ మిల్లు యజమాని నర్సింహులు తెలిపారు. రైతులు అమ్మకానికి పత్తిని తీసుకురావాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ శాఖ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ శ్రీనివాస్ కోరారు.

## నిబంధనలు ఎత్తేసి పత్తి కొనుగోళ్లు చేపట్టాలి




ఆమనగల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధనలను తొలగించి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం, సీసీఐ నిబంధనలతో రైతులను వేదనకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. తర్నికల్‌లో సీసీఐ ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వారు సందర్శించారు. ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి, తలకొండపల్లి మండలాల రైతులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకపోగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్మ సత్యం, పత్యానాయక్, అర్జున్‌రావు, పి.రవి, మనోహర్‌రెడ్డి, వెంకటయ్య, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప రాష్ట్రపతిని కలిసిన రవికాంత్‌రెడ్డి



కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వంగా కలిశారు. దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న రవికాంత్‌రెడ్డి రాధాకృష్ణన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
























































మహేశ్‌కు చెక్కును అందజేస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

## క్రీడాకారుడికి ఆర్థిక సాయం

శామీర్‌పేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు దివ్యాంగ క్రీడాకారుడు ధీరవత్ మహేశ్‌కు అధికారులు ఆర్థిక సాయం అందజేశారు. మూడుచింతలపల్లి మండలం లింగాపూర్‌తండాకు చెందిన మహేశ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగిన వివిధ పారా క్రీడా పోటీల్లో పాల్గొని 3 బంగారు, 5 వెండి, 3 కాంస్య పథకాలను సాధించాడు. శ్రీలంకలో జరగనున్న దివ్యాంగ జూనియర్ త్రోబాల్ పోటీల్లో జాతీయ జట్టుకు మహేశ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. శ్రీలంక వెళ్లేందుకు రూ.59వేల ఆర్థిక సాయానికి అర్థించాడు. మహేశ్ అభ్యర్థనను మంగళవారం మేడ్చల్ జిల్లా క్రీడాధికారి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిశ్రమల అధికారులు, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ఇండియా పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పేరిట రూ.59వేల చెక్కును మహేశ్‌కు అందజేశారు.

## పెట్టుబడుల హబ్‌గా హైదరాబాద్

» రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కె.వెంకటరెడ్డి



చేవెళ్ల/శంకర్‌పల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణం పూర్తయితే రానున్న రోజుల్లో హైదరాబాద్ పెట్టుబడులకు హబ్‌గా మారుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామం మియాఖాన్ గడ్డలో మంగళవారం త్రయ వాల్‌డ్రాఫ్ ఇన్‌స్పైర్డ్ ప్రైవేటు స్కూల్‌ను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ పైసంగతి చెప్పారు. ఏడాదిలోగా ఆర్‌ఆర్‌ఆర్ పనుల ప్రారంభానికి టెండర్లను పిలుస్తామని తెలిపారు. హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రోడ్డు పనులకు అడ్డంకులు తొలగడంతో రోడ్డు పనులు జరుగుతున్నాయన్న మంత్రి కోమటిరెడ్డి.. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు అభివృద్ధిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోయిందని, ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ సమీప చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. చేవెళ్ల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రోడ్ల నిర్మాణానికి రూ.250 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్న కోమటి రెడ్డి.. అందులో భాగంగానే కౌకుంట్ల గ్రామానికి డబుల్ రోడ్డు మంజూరు చేశామన్నారు. గ్రామీణాభివృద్ధి దిశగా తమ సర్కారు ముందుకు సాగుతుందని, రాజకీయాలకతీతంగా గ్రామీణ రోడ్లను నిర్మిస్తామన్నారు.

## రోడ్డు మధ్యలోని స్తంభాల తొలగింపు

» రహదారి పక్కన కొత్త పోళ్ల ఏర్పాటు

ఆమనగల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉందని ఈ నెల 9న ఆంధ్రజ్యోతిలో 'నిలువెత్తు నిర్లక్ష్యం' శీర్షికన వచ్చిన కథనానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు, ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. మంగళవారం స్తంభాలను రోడ్డు మధ్య నుంచి తొలగించి దూరంగా పాతే పనులకు శ్రీకారం చుట్టారు. ఆమనగల్లు-మాడ్గుల రోడ్డులో సందబావి నుంచి తలకొండపల్లి వరకు రెండు లేన్ల రోడ్డు పనులు జరుగుతున్నాయి. 50ఫీట్లకు రోడ్డు వెడల్పు చేసి డివైడర్లు ఏర్పాటు చేశారు. గతంలో రోడ్డు పక్కనున్న స్తంభాలతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎన్‌టీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దుర్గయ్య, నాయకులు చొరవ తీసుకొని రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. మంగళవారం ఆరు పోళ్లను కొత్తగా పాతారు. అన్ని స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని ట్రాన్స్‌కో డీఈ బాలకృష్ణ, ఏఈ శంకర్‌నాయక్ తెలిపారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగ్, క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థులు గ్రంథాలయాలకు రావడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొంటే ప్రతిభ వెలుగులోకి వస్తుందని చెప్పారు. ముఖ్య అతిథి ఎస్‌ఏపీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.విజయగోపాల్ మాట్లాడుతూ, విజ్ఞానమనేది మనం చెబితే తప్ప ఎవరూ దోచుకునేందుకు వీలులేనిదన్నారు. విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలకు 120మంది పాఠశాల, కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పేరం సురేష్‌బాబు, న్యాయ నిర్ణేతలు శ్రీనివాస్, సి.రాములు, వ్యాఖ్యాత ఎం.అశోక్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మరకత శివలింగాన్ని దర్శించుకున్న సినీ నటి రోజా భారతి



రోజా భారతికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందిప్పలో గల ఆలయంలోని మరకత శివలింగాన్ని 'సీతా ప్రయాణం కృష్ణ'తో సినిమా యూనిట్ సభ్యులు మంగళవారం దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్, సినిమా నిర్మాత ఖుషీ టాకీస్ అధినేత సీనియర్ యాక్టర్ రోజా భారతి, యూనిట్ సభ్యులకు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ స్వామి, వైస్‌చైర్మన్ శేఖర్ సత్కరించారు. స్వామివారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కళాశాలలో విద్యార్థుల మధ్య గొడవ

శంషాబాద్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పరిధి ఔటర్‌రింగ్ రోడ్డు సమీపంలోని మిటామైండ్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మంగళవారం గొడవపడ్డారు. ఆర్జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం క్రికెట్ ఆడే సమయంలో బాల్ తగిలిందని సీనియర్ విద్యార్థులు మనస్సులో పెట్టుకున్నారు. సాయంత్రం జూనియర్ల క్లాస్ రూమ్‌లోకి వెళ్లి గొడవకు దిగారు. దాడులు చేసుకునేంత వరకు వెళ్లింది. కళాశాల యాజమాన్యం 100కు కాల్ చేసింది. పోలీసులు చేరుకొని విద్యార్థులను అక్కడి నుంచి పంపించారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు కొట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఫిర్యాదు రాలేదని సీఐ బాల్‌రాజ్ తెలిపారు. కాగా విద్యార్థుల గొడవ విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. అనుమతులు లేని కళాశాలను ఎలా నడిపిస్తారని ప్రశ్నించారు. గతంలో కూడా చాలసార్లు మిటామైండ్‌లో గొడవలు జరిగాయని చెప్పారు.

## ఏఐసీసీ కార్యదర్శికి ఘన స్వాగతం

శంషాబాద్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమితులైన ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ మంగళవారం రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ యాదవ్‌లు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. సావంత్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, బొబ్బిలి శేఖర్, నజీర్, రమేశ్, కుమార్, ప్రవీణ్‌యాదవ్, రవినాయక్, సంజీవ్‌రెడ్డి, మిట్టు, ఉమ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో మళ్లీ సందడి

(ఐదో పేజీ తరువాయి)

గ్లోబల్ సమ్మిట్‌ను సైతం పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. వీటిపై ప్రభుత్వం విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల తరువాత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ విడుదల లోపుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని పార్టీ స్థానిక నేతలకు ఆదేశాలు జారీ చేసింది.

### అధికార యంత్రాగం సన్నద్ధం

స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రావడంతో జిల్లా అధికార యంత్రాంగం కూడా ఎన్నికల నిర్వాహణకు సన్నద్ధమవుతోంది. ఇటీవలే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల ప్రక్రియ మొదలైన తరువాత న్యాయస్థానం ఆదేశాలతో ఈ ప్రక్రియ అర్ధంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. అయితే ఇపుడు ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను ముందు నిర్వహించాలని నిర్ణయించడంతో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు ప్రకటించినా నిర్వహించేందుకు వీలుగా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ వార్డుల పునర్విభజన చేసి ఓటర్ల జాబితా సిద్ధం చేశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. రిటర్నింగ్ అధికారులతో పాటు ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల నియామకం జరిగింది. బ్యాలెట్




బాక్సులు సిద్ధంగా ఉన్నాయి. బ్యాలెట్ పత్రాలకు సంబంధించి సర్పంచులకు గులాబీ రంగు, వార్డు సభ్యులకు తెలుగు రంగులో ముద్రించనున్నారు.

### రెండు దశల్లో పంచాయతీ ఎన్నికలు

పంచాయతీ ఎన్నికలు రంగారెడ్డి, వికారాబాద్ రెండు జిల్లాల్లోనూ రెండు విడతల్లో జరగనున్నాయి. రంగారెడ్డి జిల్లాలో తొలి విడత చేవెళ్ల, కందుకూరు, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 264 పంచాయతీలు, 2,300 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే రెండో విడత మిగతా రెవెన్యూ డివిజన్లలోని 262 పంచాయతీలు, 2,368 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే వికారాబాద్ జిల్లాలో తొలి విడతలో 11 మండలాల్లోని 288 పంచాయతీలు, 2,490 వార్డు స్థానాలకు అలగే రెండో విడతలో 9 మండలాల్లోని 306 పంచాయతీలు, 2,568 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

### అత్యధికంగా ఫరూఖ్‌నగర్ మండలంలో..

తుది ఓటరు జాబితా ప్రకారం రంగారెడ్డి జిల్లాలో 7,52,259 మంది గ్రామీణ ఓటర్లు ఉండగా, వీరిలో 3,76,873 మంది పురుషులు, 3,75,408 మంది మహిళలు, 28 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలో అత్యధికంగా 51,104 మంది ఓటర్లు, అత్యల్పంగా ఆమనగల్‌లో 14,712 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే వికారాబాద్ జిల్లాలో మొత్తం 6,98,472 గ్రామీణ ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,43,668, మహిళలు 3,54,788, ఇతర ఓటర్లు 16 మంది ఉన్నారు.

### పంచాయతీ పాలన అస్తవ్యస్తం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయి గ్రామీణ ప్రాంతాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. 2024, ఫిబ్రవరి ఒకటో తేదీతో పంచాయతీ పాలకవర్గాల పాలన ముగియగా, అదే ఏడాది జూలై నెలలో మండల పరిషత్తులు, జెడ్పీ పాలక వర్గం గడువు సైతం ముగిసిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగిస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పంచాయతీలు, జెడ్పీ, మండల పరిషత్తులలో ప్రత్యేకాధికారుల పాలననే కొనసాగుతోంది. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయి పాలన దుర్భరంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల విషయం ఎలా ఉన్నా.. ప్రజలకు కనీస సదుపాయాలను కూడా కల్పించలేకపోతున్నారు. ప్రజల నుంచి వసూలయ్యే పన్నులతోనే పంచాయతీల్లో కార్మికుల వేతనాలు, అత్యవసర పనులు చేపడుతుండటం గమనార్హం.

## రూ.2కోట్లకుపైగా అప్పు చేసి పరార్

» లబోదిబోమంటున్న బాధితులు

కులకచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో విజయ్ జ్యువెలరీ షాపు యజమాని వద్ద బంగారాన్ని తాకట్టు పెట్టుకొని రూ.2కోట్లకుపైగా అప్పులు తీసుకోగా గుట్టు చప్పుడు కాకుండా షాపు మూసి పరారయ్యాడు. ఎస్సై రమేశ్‌కుమార్, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్‌కు చెందిన నరేందర్ కొన్నేళ్ల క్రితం అజయ్ జ్యువెలర్ షాపు పెట్టి ప్రజల బంగారు తాకట్టుపెట్టుకొని వడ్డీకి డబ్బులిస్తున్నాడు. వందలాది మంది అతడి వద్ద బంగారాన్ని తాకట్టుపెట్టి రూ.2కోట్లకుపైగా అప్పు తీసుకున్నారు. చెరువుముందలి తండా(కె)కు చెందిన రఘునాయక్ ఈ నెల 14న తన పాత బంగారం 30 గ్రాములిచ్చి మరో 50గ్రాములు కలిపి అభరణం చేయాలని అడ్వాన్స్‌గా రూ.1.35లక్షలు ఫోన్‌పే చేశాడు. 16న వస్తే ఇస్తానని నరేందర్ చెప్పాడు. సోమవారం రఘు షాపునకు రాగా మూసి ఉంది. శనివారం రాత్రే షాపు ఖాళీ చేసి కుటుంబంతో పరారయ్యాడని తెలిసింది. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గోరిగడ్డ తండాకు చెందిన గోపాల్ నాయక్ నరేందర్‌కు రూ.10లక్షలు అప్పిచ్చాడు. నరేందర్ పాట్ కాగితాలు కుదవ పెట్టి మరోవ్యక్తి వద్ద రూ.10లక్షలు అప్పుతీసుకున్నాడు. వందల మంది జువెలర్ షాపులో బంగారు తాకట్టు పెట్టారు. రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, ఎస్ఐ తెలిపారు.

## ప్రభుత్వ తోడ్పాటుతో ఆర్థిక భరోసా

ఆమనగల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, తోడ్పాటుతో పేదలకు ఆర్థిక భరోసా కలుగుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మహిళా సంక్షేమం, భద్రత, ఉపాధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. కడ్తాల ఎంబీఏ గార్డెన్‌లో తలకొండపల్లి, కడ్తాల మండలాల 84 మంది లబ్ధిదారులకు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, తహసీల్దార్ జయశ్రీ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు



కడ్తాలలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



ముర్తోజుపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

శ్రీనివాస్‌రెడ్డిలతో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషిచేస్తామని యువకులు, నాయకులతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ముర్తోజుపల్లిలో కర్నాటి అనితనాగార్జునరెడ్డి ఇందిరమ్మ ఇంటిని మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌లతో కలిసి ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనాదక్షతతో రెండేళ్లలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందన్నారు. ఓర్వలేని విపక్షాలు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని మండిపడ్డారు. స్థానికంగా సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కర్నాటి శ్రీధర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రాములు, యాట నర్సింహ, తహసీల్దార్లు రమేశ్, ఫయ్యాంఖాద్రీ, ఎంపీడీవోలు సుజాత, మాధురి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టులో మహిళ హల్‌చల్



ఎయిర్‌పోర్టులో హల్‌చల్ చేసిన మతిస్థిమితం లేని మహిళ

శంషాబాద్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ మహిళ హల్‌చల్ చేసిన సంఘటన మంగళవారం ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన దేవమణి పేజ్(35) ఎయిర్‌పోర్టులోని అరైవల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరించగా సీఐఎస్ఎఫ్ అధికారులు ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఆమె మానసిక స్థితి బాగలేదని పోలీసులు తెలిపారు. అధికారులపై ఆమె దురుసుగా ప్రవర్తించింది. ఆధార్ కార్డు వివరాల ప్రకారం ఆమె జిల్లా, ఊరు పేర్లు తెలిశాయి. కానీ మాట్లాడలేని స్థితిలో ఉందని పోలీసులు గుర్తించారు. ఎయిర్‌పోర్టులో హైఅలర్ట్ కొనసాగుతున్న నేపథ్యంలో అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. మహిళకు సంబంధించిన వారు ఎవరైనా వస్తే అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. మహిళను పోలీస్ స్టేషన్‌లో అప్పగించే సమయంలో ఆర్జీఐఏ ఔట్‌పోస్టు స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ లేక సీఐఎస్ఎఫ్ అధికారులు అసహనం వ్యక్తం చేశారు. విమానాశ్రయంలో రాత్రిపూట మహిళా కానిస్టేబుల్ లేకపోవడం ఏమిటని విధుల్లో ఉన్న అధికారులను ప్రశ్నించారు.

### విమానంలో ప్రయాణికుడికి తీవ్ర అస్వస్థత

» చికిత్స అనంతరం స్వస్థలానికి...

శంషాబాద్ రూరల్: కొలంబో నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న 6ఈ1182 ఇండిగో విమానంలో లోహిత్ శ్రీకాంత్(63) అనే ప్రయాణికుడికి వాంతులు, విరేచనాలు కావడంతో పైలట్ ఏటీసీకి సమాచారం ఇచ్చి ఏఎంసీ(ఎమర్జెన్సీ మెడికల్ సిబ్బంది)ని అలర్ట్ చేశారు. విమానం 4.16గంటలకు ఎయిర్‌పోర్టులో ల్యాండైంది. అప్పటికే అపోలో ఏఎంసీ సిబ్బంది ప్రయాణికుడిని ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. వైద్యం అందించిన డాక్టర్లు అతడి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. కాగా నిర్ణీత సమయం కంటే 15నిమిషాల ముందు విమానం ల్యాండైంది. చికిత్స అనంతరం లోహిత్ శ్రీకాంత్ స్వస్థలానికి వెళ్లిపోయారు.

### విమానాన్ని ఢీకొన్న పక్షి?

శంషాబాద్ రూరల్: ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానాన్ని పక్షి ఢీకొట్టిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఢిల్లీ నుంచి వస్తున్న 6ఈ1793 ఇండిగో విమానం ఉదయం 8.15గంటలకు శంషాబాద్‌లో ల్యాండ్ అవుతుండగా పక్షి ఢీకొన్నట్టు అనుమానించిన పైలెట్ ఏటీసీకి సమాచారం ఇచ్చాడు. అప్రమత్తమైన అధికారులు విమానం సురక్షితంగా ల్యాండైన తరువాత రన్‌వేను పరిశీలించారు. అక్కడ ఎలాంటి పక్షి ఆనవాళ్లు లేవని ప్రకటించారు. అలాగే విమానం రెక్కలు, బాడీ ఎక్కడా డ్యామేజ్ కాలేదని అధికారులు నిర్ధారించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ఎజెండా

**బస్సు జాతలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ**



సీపీఐ బస్సు జాతలో అభివాదం చేస్తున్న నాయకురాలు పద్మ

వికారాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పోరాటాలు చేస్తూ పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసిన చరిత్ర సీపీఐదని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. మంగళవారం వికారాబాద్‌కు వచ్చిన సీపీఐ బస్సు జాతాకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జాతకు నాయకత్వం వహిస్తున్న పద్మ మాట్లాడుతూ.. ప్రజల కోసం పార్టీ నాయకులు ఎన్నో ఉద్యమాలు, త్యాగాలు, బలిదానాలను చేశారన్నారు. ప్రజాపోరాటాలతో హక్కులు సాధించారని, ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టం వంటివి ఈ కోవలోనివే అని గుర్తు చేశారు. దేశాన్ని శాసిస్తున్న అంబానీ, అదానీలతో పభుత్వ సంస్థలన్నీ నిర్వీర్యమయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సీపీఐ నాయకత్వం వహించి పేదలకు భూమి పంచిందని, 10వేల గ్రామాలను రజాకార్ల చెరనుంచి విడిపించిందని తెలిపారు. ఈ నెల 15న బాసర నుంచి ప్రారంభమైన బస్సు జాత డిసెంబరు 26న ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభతో ముగిస్తుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీపండిత్ మాట్లాడుతూ, వందేళ్లు పూర్తి చేసుకున్న సీపీఐకి ప్రజల ఆశీర్వాదం ఉందన్నారు. ప్రజాసేవ, పోరాటాలే పార్టీ బలం అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, అనంతయ్య, వెంకటేశ్, వలీవుల్లా ఖాద్రి, సురేష్‌బాబు, జగదాంబ, నసీమాబేగం, ఖాదర్, ఏసురత్నం, చంద్రయ్య, రాజేందర్, మంగమ్మ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలి

చేవెళ్ల: పెట్టుబడిదారుల కోసం పని చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు లౌకిక శక్తులు ఏకం కావాలని పశ్యపద్మ అన్నారు. చేవెళ్లకు చేరిన బస్సు జాతలో ఆమె మాట్లాడారు. సీపీఐ ఏర్పడి వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహిస్తామని, సీపీఐ శ్రేణులు, సానుభూతిపరులు తరలిరావాలని కోరారు. పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య మాట్లాడుతూ.. పేదల ఇండ్ల స్థలాల కోసం పోరాడి చేవెళ్ల, అబ్దుల్లాపూర్‌మెట్టు ప్రాంతంలో జాగలు ఇప్పించిన ఘనత సీపీఐదే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు రామస్వామి,రామకృష్ణ, ప్రభులింగం, సత్యనారాయణ, సత్తిరెడ్డి, జంగయ్య, సుధీర్, శ్రీనివాస్, మక్బూల్, అంజయ్య, మంజుల, సుధాకర్‌గౌడ్, శివారెడ్డి, రాజేందర్‌గౌడ్, శివ, లలిత, వెంకటమ్మ పాల్గొన్నారు.

# ఆ సీఐలపై అటాచ్ వేటు!

● తాండూరు రూరల్ గత సీఐలపై చర్యల పరంపర ● పలు ఆరోపణల నేపథ్యంలో ఐజీ కార్యాలయానికి అటాచ్

» పైరవీతో వచ్చి వివాదాల్లోకి అధికారులు
» సీఐలు, ఎస్సైల మధ్య సమన్వయ లోపం
» ప్రస్తుత సీఐ సైతం ఐజీ ఆఫీస్‌కు అటాచ్..
» కొత్త అధికారికి బాధ్యతల అప్పగింత




తాండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాండూరు రూరల్ పోలీసు స్టేషన్(కరణ్‌కోట)లో విధులు నిర్వర్తిస్తున్న సీఐలలో ఎక్కువ మంది అనతి కాలంలోనే ఉన్నతాధికారుల కార్యాలయానికి అటాచ్/బదిలీలు అయ్యారు. ఈ సర్కిల్ పరిధి యాలాల, పెద్దేముల్ ఎస్ఐలతో విభేదాలు, రాజకీయ ఒత్తిళ్లు, కాగ్నాలో ఇసుక అక్రమ రవాణా వంటి వివాదాల కారణంగా ఇక్కడ సీఐలపై వేటు పడుతోంది. రూరల్ సీఐ పోస్టింగ్‌ల వివరాల్లోకి వెళ్తే.. 2012 ఫిబ్రవరి 2న గౌతాపూర్ సమీపంలో రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఆ సమయంలో తాండూరు అర్బన్ సీఐ శ్రీనివాసులును అప్పటి హోంమంత్రి సబితారెడ్డి, ఐజీ రాజీవ్ రతన్‌ల సమక్షంలో కొందరు స్థానికులు సన్మానించారు. దీనిపై సీరియస్సయిన ప్రభుత్వం శ్రీనివాస్‌లును ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసింది. ప్రస్తుతం ఆయన వికారాబాద్ పోలీస్ ట్రైనింగ్ డీఎస్పీగా ఉన్నారు. 2013 జనవరి 16న కస్టడీలో ఉన్న మల్లేష్ అనే నిందితుడు స్టేషన్ పైఅంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల చిత్రహింస వల్లే ఆత్మహత్య చేసుకున్నాడనే ఆరోపణలతో సీఐలు శ్రీనివాస్, పవన్ ఉన్నతాధికారుల విచారణ ఎదుర్కొన్నారు. కాగా ఓ నాయకుడి ప్రోద్బలంతో స్టేషన్‌లో విందు చేసుకున్నారని ఐదుగురు పోలీసులను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. అటాచైన వారిలో సీఐ శ్రీనివాస్ ఉన్నారు. ప్రస్తుతం ఆయన పరిగి డీఎస్పీ. 2014లో కరన్‌కోట్ సీఐ రవికుమార్ మహబూబ్‌నగర్ క్రైం స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

### ఎస్సై ఆత్మహత్య నేపథ్యంలో...

సంగారెడ్డి టౌన్ సీఐగా పనిచేసిన శివశంకర్ 2014లో రూరల్ సీఐగా వచ్చారు. యాలాల ఎస్సై రమేశ్ కందనెల్లిలో 2015 సెప్టెంబరు 16న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి ఆత్మహత్యకు సీఐ శివశంకర్ వేధింపులే కారణమని రమేశ్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐని డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేసి సీఐడీ విచారణ చేయించారు. ఇందులో సీఐ పాత్ర లేదని తేల్చారు. అనంతరం 2015లో రూరల్ సీఐగా సైదిరెడ్డి వచ్చారు. 2016లో యాలాల ఎస్ఐ అరుణ్‌కుమార్, సీఐల మధ్య విభేదాలొచ్చాయి. 2017లో సంగెంఖుర్దులో ఓ వివాహిత హత్య కేసులో ఆరోపణలు రావడంతో సీఐ, ఎస్ఐలను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. డిపార్ట్‌మెంటల్ విచారణలో సీఐ సైదిరెడ్డికి క్లీన్‌చిట్ రాగా తిరిగి కరన్‌కోట్ సీఐగా నియమించారు. ఇక్కడ మూడేళ్లు పనిచేసిన సైదిరెడ్డి ఆరోపణలు రాగా 2018లో సస్పెండయ్యారు. సస్పెన్షన్ ఎత్తివేత తర్వాత ఆయన హైదరాబాద్‌లో పోస్టింగ్ తీసుకున్నారు. అనంతరం సీఐగా ధారూర్‌లో పనిచేస్తున్న ఉపేందర్ వచ్చారు. వికారాబాద్ ఎస్పీకి బదిలీ అయిన యాలాల ఎస్ఐ సురేందర్‌రెడ్డి.. సీఐపై డీఐజీకి ఫిర్యాదు చేయడం, ఉపేందర్‌ను బదిలీ చేయాలని ఓ ప్రజాప్రతినిధి డీఐజీని కలవడంతో 2019లో ఉపేందర్ కూడా అటాచయ్యారు. తర్వాత కరణ్‌కోట సీఐగా వచ్చిన జలేందర్‌రెడ్డి ఎక్కువ కాలం పనిచేశారు. 2019 నుంచి 2022 వరకు వివాదాలకు తావివ్వకుండా విధులు నిర్వర్తించారనే పేరుంది. ఆయన తదుపరి సీఐగా రాంబాబు వచ్చారు. ఎన్నికల్లో ఓ పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణలతో బదిలీ అయ్యారు. తర్వాత సీఐగా అశోక్ వచ్చారు. ఆయనా ఆరోపణలతో బదిలీ అయ్యారు. అనంతరం సీఐగా వచ్చిన నగేశ్ ఓ హత్య కేసు విచారణలో పాల్గొన్నారు. పెద్దేముల్ ఎస్ఐ వేణు.. ఓ కేసులో అనుమానితుడిని చితకబాదడని, ఇది సీఐ నగేశ్ వైఫల్యమేనని వచ్చిన ఆరోపణలతో ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే సైతం సీఐ పనితీరుపై అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. కాగా ఇక్కడ నగేశ్ 11 నెలలు పనిచేశారు. ఆయన స్థానంలో ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోమవారం రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.

### అర్బన్ సీఐ బదిలీ లేనట్టే..

తాండూరులో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించడం, ఉన్నతాధికారుల అండదండలతో అర్బన్ సీఐ సంతోష్‌కుమార్ బదిలీకి బ్రేక్ పడింది. మొదట రూరల్, అర్బన్ సీఐల బదిలీకి ఉన్నతాధికారులు నిర్ణయించినట్టు సమాచారం. అయితే పెద్దేముల్ ఎస్సై ఓ బాధితుడిని చితకబాదిన నేపథ్యంలో రూరల్ సీఐపై వెంటనే వేటు పడింది. అలాగే సంగెం కలాన్, చంద్రవంచల్లో జరిగిన వర్గాపోరు ఘటనల్లోనూ నగేష్ సమర్థంగా పనిచేయలేదనే విమర్శలొచ్చాయి. సంగెంకలాన్‌లో ఘటనపై చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే చెట్టినాడ్ సిమెంట్ కర్మాగార యాజమాన్యానికి సీఐ నగేష్ సపోర్ట్ చేస్తున్నాడని ఎంపీ నేరుగా విమర్శించారు. ఇదిలా ఉంటే అర్బన్ సీఐ సంతోష్‌కుమార్‌ను సైతం గతంలో ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కారణం ఏదైనా ఆయన మరలా ఇక్కడే విధుల్లో చేరారు. ప్రస్తుతం సంతోష్‌కుమార్ బదిలీ కానట్టే అని తెలుస్తోంది. అలాగే పెద్దేముల్ ఎస్ఐని బషీరాబాద్ స్టేషన్‌కు పంపుతున్నారని సమాచారం. హత్య కేసులో అనుమానితుడిని చితకబాదిన ఘటనలో ఎస్సై వేణుపై విచారణ జరిపి ఎస్పీకి నివేదించినట్లు డీఎస్పీ నర్సింగ్ యాదవ్ తెలిపారు.

## ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి


టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

మర్పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ మహిళా ఉపాధ్యాయుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న మర్పల్లి మండల విద్యాధికారి అంజిలయ్యపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.వెంకటరత్నం, రాములు, బసప్ప మంగళవారం జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మర్పల్లి మండల విద్యాధికారి అంజిలయ్య మహిళా ఉపాధ్యాయుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ప్రసూతి, వైద్య సెలవుల మంజూర్‌లో అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. మహిళా ఉపాధ్యాయులు పని చేసిన పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా నెలకు రెండు, మూడు సార్లు సందర్శించి అక్కడ పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మండల పరిధిలో మధ్యాహ్న భోజనబిల్లుల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తూ ఏజెన్సీ నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించడంలో విఫలమయ్యారన్నారు. గత సంవత్సరం అక్టోబరు నుంచి ఇప్పటి వరకు మండలంలోని చాలా పాఠశాలలకు మధ్యాహ్న భోజన బిల్లులు అందించలేదన్నారు. ఈ విషయంపై అడిగిన వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పీఎంశ్రీ పాఠశాలలకు నిధుల వినియోగంలో, క్రీడా సామగ్రి కొనుగోలులో అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఎన్నారంలో ఉచిత వైద్యశిబిరం


వైద్యశిబిరంలో మెడిస్టార్ ఆస్పత్రి సిబ్బంది

కోట్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్నారం గ్రామంలో మంగళవారం మెడిస్టార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ స్వామిదాస్ ఆదేశాల మేరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 170మందికి గైనాకలజిస్ట్, పిడియాట్రీషియన్, ఆర్థోపెడిషియన్ డాక్టర్లు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వామిదాస్, మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ లత, రష్మిక, రవితేజ, గోవర్ధన్, హాస్పిటల్ సిబ్బంది, ఎం.బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులు చదువులో రాణించాలి


ఫ్రెషర్స్‌డేలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రప్రియ

వికారాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు తల్లిదండ్రులను గౌరవించడం అలవర్చుకోవాలని డాక్టర్ చంద్రప్రియ అన్నారు. పట్టణంలో భృంగీ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. సమాజంలో ఎదగాలంటే విద్య దోహదపడుతుందన్నారు. ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శివప్రసాద్, పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి, ప్రిన్సిపాల్ రమాదేవి, లెక్చరర్స్ పాల్గొనగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

## నూతన ఉపాధ్యాయుల సర్వీస్ పుస్తకాలను రాయించాలి

కొడంగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నూతన ఉపాధ్యాయుల సర్వీస్ పుస్తకాలను మండల విద్యాధికారి రాయించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. మండలంలోని ఐనన్‌పల్లి, ప్యాలమద్ది, చిన్ననందిగామ, రావుల్‌పల్లి, పెద్దనందిగామ, హస్నాబాద్, పర్సాపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్, అశోక్ కుమార్, నర్సిములు, నాయకులు అశోక్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కరన్‌కోట్ సీసీఐ జనరల్ మేనేజర్‌గా రవి సరోజ్

తాండూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్ గ్రామ శివారులోని ప్రభుత్వరంగ సీసీఐ కర్మాగారం జనరల్ మేనేజర్‌గా రవీందర్‌కుమార్ సరోజ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శరత్ కుమార్ కేంద్ర భారీ పరిశ్రమలశాఖ ప్లానింగ్ డైరెక్టర్‌గా పదోన్నతిగా బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో బొకోజన్ సీసీఐ కర్మాగారం జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న రవిసరోజ్ తాండూరు సీసీఐకి బదిలీపై వచ్చారు. జీఎం రవీందర్ కుమార్ సరోజ్‌ను కొంతమంది కార్మికులు ఘనంగా సన్మానించారు.

## యాలాల ఎంపీడీవోగా సంపత్‌కుమార్

యాలాల, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): యాలాల మండల నూతన ఎంపీడీవోగా సంపత్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా ఉన్న పుష్పలీలను ప్రభుత్వం జిల్లా పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేశారు. దీంతో తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ సంపత్ కుమార్‌ను ఫుల్ అడిషనల్ చార్జి ఎంపీడీవోగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన సంపత్‌కుమార్‌ను మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ అన్నపూర్ణ, బాల్‌రాజ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

## తాండూరులో ఘనంగా 'సదర్'


ఉత్సవంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజుగౌడ్

తాండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మొట్టమొదటి సారి కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు నిర్వహించారు. ఆదర్శనగర్ కుంట మైసమ్మ దేవాలయం నుంచి భద్రేశ్వర్ దేవాలయం వరకు దున్నపోతుల విన్యాసాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులపక్షాన పోరాడుతాం

● మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి


రాకంచర్ల పత్తిమిల్లులో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

పూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు న్యాయం చేసేవరకూ రైతుల పక్షాన పోరాడుతామని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. పత్తి రైతులకు అన్యాయం జరుగుతోందని మంగళవారం పూడూరు మండలంలోని రాకంచర్ల పత్తి మిల్లును మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి సందర్శించారు. మిల్లు వద్ద రైతులతో మాజీ మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో తక్షణమే చర్చలు జరిపి రైతులకు న్యాయం చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీఎకరాకు 12క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు కోత విధించి కేవలం ఏడు క్వింటాళ్లకు మాత్రమే పరిమితం చేశారన్నారు. అదేవిధంగా చాలా మంది రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్లు ఉండవని, యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఒత్తిడికి గురిచేయడమేంటని ప్రశ్నించారు. మొదటి కేటగిరిలో రాకంచర్ల, సోమన్‌గుర్తి ధరణి మిల్లులను కేటాయించారని తెలిపారు. దీంతో పూడూరు మండంలోని రైతులు, ఇతర గ్రామాల రైతులు వారి దగ్గరున్న మిల్లును కాకుండా, దూరంగా ఉన్న మిల్లులు కేటాయించడంతో రవాణా ఖర్చు అధికమవుతోందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు ఎలాంటి నష్టం కలిగించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం వల్ల రైతులు పూర్తిస్థాయిలో నష్టపోతున్నారన్నారు. వీటిని తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఘట్‌కేసర్ రూరల్: రుద్రాభిషేకంలో కీసరగుట్ట ఆలయకమిటీ సభ్యులు సామల అమర్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఎదులాబాద్ లోని శ్రీ భవాని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కృష్ణం గారక చతుర్థి, మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకంను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి పాలాభిషేకం, పుష్పాభిషేకం, చందనాభిషేకంతో పాటు ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయప్రాంగణమంతా శివనామస్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో కీసరగుట్ట ఆలయకమిటీ సభ్యుడు సామల అమర్, భవాని, మల్లికార్జున రాజు, సంతోష్, వెంకటేష్, సరిత, నవీన్ నాగమణి, రఘు, పర్ణిత, రాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: కార్తీక మాసం పురస్కరించుకొని తుల్జభవానీ ఆలయంలో క్షత్రియ సమాజ్, కాలనీ వాసుల ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శ్రీలత లక్ష్మీకాంత్, సంఘం అధ్యక్షులు విజయ్ రామరావు, తదితరులు పాల్గొన్నారు. తాండూరు పట్టణం సాయిపూర్ మాజీ కౌన్సిలర్ నీరజ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ మహిళలు కార్తీక వన భోజనం నిమిత్తం మణ్యం కొండ, కరుమూర్తి ఆలయానికి ప్రత్యేక బస్సులో వెళ్లారు.

### రేణుక ఎల్లమ్మ ఆలయంలో..

శామీర్‌పేట: మండల కేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సిద్దిపేట వాస్తవ్యులు శామీర్‌పేట పరిధిలోని పుట్నాని విల్లాలో ఉంటున్న పన్యాల మహిపాల్‌రెడ్డి, అపర్ణ దంపతులు, వారి కూతురు సౌమ్యరెడ్డిలు అన్నదానం చేశారు. పల్లవి స్కూల్ మాధవరెడ్డి 25కేజీల బియ్యం అందజేశారు.

### శివరాంనగర్‌లో అయ్యప్ప పడిపూజ

వికారాబాద్: పట్టణంలోని శివరాంనగర్ కాలనీలో అయ్యప్ప పడిపూజ కనుల పండుగగా నిర్వహించారు. రామకృష్ణ, వెంకటేశ్ గురుస్వామి నివాసంలో కన్నెస్వాములు సాయి, బిట్టు స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప పాటలతో 19మెట్ల పడి కాల్చి అయ్యప్పలు ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## ఏసీబీ దాడులు.. అధికారుల బెంబేలు!

(ఐదో పేజీ తరువాయి)

అదుపులోకి తీసుకుని తమదైన తరహాలో విచారిస్తున్నారు. వారి ఫోన్లను సైతం స్వాధీనం చేసుకుని సిబ్బందితో జరిపిన లావాదేవీలపై ఆరా తీస్తున్నారు. దీంతో పరిస్థితులు చక్కబడే వరకు కార్యాలయాలకు వెళ్లకుండా ఉండటమే ఉత్తమమని పలువురు డాక్యుమెంట్ రైటర్లు భావిస్తున్నారు. దాదాపు 20 మంది డాక్యుమెంట్ రైటర్లను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది.

### సబ్ రిజిస్ట్రార్లు సైతం..

జిల్లాలోని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, శామీర్‌పేట, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఇప్పటి వరకు వరుసగా తనిఖీలు చేపట్టారు. జిల్లాలోని భూముల ధరలు కోట్లలో ఉండటంతో ఇదే అదనుగా పలువురు సబ్‌రిజిస్ట్రార్లు సైతం యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా నిషేధిత భూములు, కన్వర్షన్ భూములు, గ్రామ కంఠం భూముల రిజిస్ట్రేషన్లకు పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది.

## కంటి వైద్య శిబిరం విజయవంతం

బొంరాస్‌పేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 66 మందిని కంటి శస్త్ర చికిత్సల కోసం రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రవీందర్‌యాదవ్, వైద్యులు రాఘవేందర్, ఎంపీడీవో వెంకన్‌గౌడ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం

మేడ్చల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అనురాధ అన్నారు. మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు అందించటానికి ఏర్పాటు చేసిన పలు యూనిట్ల పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, రోహిత్ పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు


దౌల్తాబాద్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి

దౌల్తాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం విక్రయాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శేరి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బోడివెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాటూర్ గ్రామంలో మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలో 10కేంద్రాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో 2 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**దుద్యాల:** మండలంలోని కుదురుమళ్ల రైతువేదికలో మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనితరఘుపతి, యాదగిరిరెడ్డి, లాలప్ప, మాధవరావు, హనుమంతు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**కొడంగల్ రూరల్:** మండల పరిధిలోని అంగడిరైచూర్, చిట్లపల్లి గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ కట్కం శివకుమార్ గుప్తా, నందారం ప్రశాంత్, వెంకట్ రెడ్డి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుకు గండి.. పూడ్చివేత

కులకచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామునిపల్లి చెరువుకు పడిన గండిని పూడ్చారు. మంగళవారం తెల్లవారుజామున చెరువుకు తూము దగ్గర రంధ్రం పడి నీరు వృథాగా వెళ్లింది. గమనించిన రైతులు అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్కడికి చేరుకొని ట్రాక్టర్ల ద్వారా మట్టిని తెప్పించి జేసీబీల సాయంతో గండిని పూడ్చివేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీడీవో రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఆంజనేయులు, మైపాల్‌రెడ్డి, కుమ్మరి స్వామి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## పేద ప్రజలను ఆదుకుంటాం

కులకచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలను ఆదుకుంటామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. పీరంపల్లి గ్రామంలో సైదుపల్లి వెంకటయ్య భార్య సత్యమ్మ (58)అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియలకు తక్షణ సాయంగా రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, కుమ్మరి స్వామి, వెంకటయ్య, రాములు, శ్రీనివాస్, శంకర్‌నాయక్, బక్కని శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


మేడ్చల్ టౌన్: ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

మేడ్చల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. మేడ్చల్, ఎల్లంపేట మున్సిపాలిటీలో స్థానిక కమిషనర్లు ప్రతిజ్ఞ చేయించారు. మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ సుధాకర్, కళాశాలల్లో విద్యార్థులతో అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు.

**శామీర్‌పేట:** అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ-2025 కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మెప్మా ఇన్‌చార్జి అధికారి ప్రమీలాదేవి, టీపీవో వికాస్, సిబ్బంది పాల్గొన్నారు.

**పరిగి:** పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నంబర్ 1 పాఠశాలలో మాదక ద్రవ్యాల నిరోధంపై పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ నరేష్, సీనియర్ అసిస్టెంట్ దశరథం, ఎంఈవో గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**తాండూరు:** నషాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం తాండూరు మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రతిజ్ఞ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయం మెప్మా ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, ఎక్సైజ్ సీఐ ఎన్.రాణి, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్ నాయక్ పాల్గొన్నారు.

## సేవలతోనే ప్రజల్లో గుర్తింపు

కులకచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సేవలతోనే ప్రతీ ఉద్యోగికి ప్రజల్లో గుర్తింపు వస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. మండలానికి కొత్తగా వచ్చిన ఎంపీవో శ్రీనివాస్‌ను మంగళవారం ముజాహిద్‌పూర్ గ్రామ పంచాయతీలో సన్మానించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, మాజీ సర్పంచ్ చంద్రభూపాల్, చంద్రయ్య పాల్గొన్నారు.

## దుద్యాల్ ఎస్సైగా శ్రీశైలం



దుద్యాల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుద్యాల్ నూతన ఎస్సైగా పి.శ్రీశైలం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న యాదగిరి వికారాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాండూర్ టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శ్రీశైలం బదిలీపై దుద్యాల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

## సంక్షిప్తంగా..

### నేడు అందెశ్రీ సంతాప సభ

ఘట్‌కేసర్ రూరల్: సహజకవి, ప్రముఖ రచయిత అందెశ్రీ సంతాపసభకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు కట్ట దయాకర్‌రెడ్డి, జంపాల వినయ్‌లు తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్ డీజీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో అందెశ్రీ సంతాపసభను బుధవారం ఏర్పాట్లు పూర్తిచేశారు.

### 26న చలో ఢిల్లీ

శామీర్‌పేట: జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ఈనెల నవంబరు 26న హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని భారీఎత్తున నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ గుజ్జుక పరశురాం, సీనియర్ నాయకుడు బొమ్మర్ల నాగరాజు తెలిపారు. శామీర్‌పేటలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ మాలల రాజ్యాంగ హక్కుల సాధనకు ఈనెల 26న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. మేడ్చల్ జిల్లాలోని మాలలు ప్రతీ ఒక్కరు చైతన్యస్ఫూర్తితో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు లాల్‌గడి గ్రామ అధ్యక్షుడు కైర బాలు, బందెల నరేష్, బత్తుల అంజనేయులు, గుజ్జుక నర్సింగ్‌రావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లోకి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్

తాండూరు: తాండూరు ఎంఐఎం సీనియర్ నాయకుడు మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సాజిద్‌అలీ మంగళవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, పెద్దేముల్ కాంగ్రెస్ నాయకులు ఉప్పరి మల్లేశం ఉన్నారు.

### మంచినీటి బోరు వద్ద సిమెంట్ బెడ్డు ఏర్పాటు

కోట్‌పల్లి: తాగునీటి బోరు వద్ద నీళ్లు పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉందని బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు యాదయ్యతో పాటు గ్రామస్తులు నాగసన్‌పల్లిలో సింగిల్‌పేజ్ జెట్ పంపు వద్ద సిమెంటు బెడ్డు వేయించారు.

### బాల్య వివాహాలను అరికడదాం

తాండూరు రూరల్: చెంగోల్‌లోవిద్యార్థులకు బాల్య వివాహాలను అరికట్టాలని అంగన్‌వాడీ టీచర్ల సమక్షంలో అవగాహన కల్పించారు. 'బాల్యవివాహాలు అరికడదాం' అనే నినాదంపై చిరంజీవి కళా ప్రదర్శన కళాకారులతో అవగాహన కల్పిస్తూ విద్యార్థులను చైతన్య పరిచారు.

### కాంగ్రెస్‌తోనే తండాల అభివృద్ధి

బొంరాస్‌పేట్: కాంగ్రెస్‌తోనే తండాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని ఏనమీదితండా పంచాయతీ పరిధిలోని హనుమనాయక్ తండా, మెట్టుచెలకతండాలో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కడా నిధులు రూ.14లక్షలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పేట్‌బషీరాబాద్ అడ్మిన్ ఎస్ఐ మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ ఫతేనగర్‌కు చెందిన శ్యామ్‌కుమార్ మండల్(35) మేడ్చల్ జిల్లాలోని గిర్మాపూర్‌లోని బిజినెస్ ప్రెస్ ప్రొడక్ట్స్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య పింకి, ఒక పాప ఉంది. ఈనెల 17వ తేదీన రోజూమాదిరిగానే విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరుగుప్రయాణమైంది. గుండ్లపోచంపల్లి నుంచి కొంపెల్లి మీదుగా బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో చాయాకేఫ్ బంక్ సమీపంలో రోడ్డుపై నిలిపిన జేసీబీని ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య పింకి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో మరొకరు..

తాండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాజీచౌక్‌లోని ఎడ్లబజార్ సమీపంలో అంతారం తండాకు చెందిన రామునాయక్(50) మంగళవారం అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి నుదుటిపై తీవ్ర గాయం కావడంతో కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. సీసీఫుటేజ్‌ను పరిశీలించగా రామునాయక్ ఫిడ్స్‌తో రోడ్డుపై పడి మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

తాండూరు/యాలాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గంలోని రాజీవ్ కాలనీలోని ఓఇంట్లో చోరీ జరిగింది. తాండూరు మాతాశిశు ఆస్పత్రివద్ద షాపు నిర్వహిస్తున్న బుజ్జమ్మ ఇంటికి తాళంవేసి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు తాళం విరగ్గొట్టి చోరీ చేశారు. బుజ్జమ్మ ఇంటికి వచ్చేసరికి తాళం విరగ్గొట్టి ఉండగా ఇంట్లో దాచిన 3 తులాల బంగారు ఆభరణాలు, 50తులాల వెండి కనిపించలేదు. దీంతో బాధితురాలు యాలాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా పోలీసులు క్లూస్ టీంను రప్పించి విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

## డిప్యూటీ సీఈవో, సూపరింటెండెంట్లకు సన్మానం


జడ్పీ డిప్యూటీ సీఈవో హిరణ్మయి, సూపరింటెండెంట్లు నందకుమార్, శ్రీనివాస్‌లను సన్మానిస్తున్న జెడ్పీ ఉద్యోగులు

వికారాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జడ్పీ డిప్యూటీ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన హిరణ్మయి, సూపరింటెండెంట్లుగా పదోన్నతి పొందిన ఆకుల నందకుమార్, టి.శ్రీనివాస్‌లను మంగళవారం జిల్లా పరిషత్తు కార్యాలయం ఉద్యోగులు శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఇదిలా ఉంటే, సూపరింటెండెంట్లుగా పదోన్నతి పొందిన ఆర్.వెంకటేశ్వర్లును పెద్దేముల్ మండల పరిషత్తు కార్యాలయానికి కేటాయించగా, జి.చంద్రశేఖర్‌ను కోట్‌పల్లి మండలానికి, ఎండీ ఆసానుద్దీన్‌ను దౌల్తాబాద్, వి.సంపత్‌కుమార్ తాండూరు, ఎం.బాలకృష్ణారెడ్డిని కొడంగల్ మండలానికి కేటాయించారు.

## సీఎం, స్పీకర్‌లను కలిసిన ఎమ్మెల్యే


సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు.

## ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తాండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, ఆర్ అండ్‌బీ డీఈ శ్రవణ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్, పోలీసులు మంగళవారం సంయుక్తంగా పరిశీలించారు. చిరువ్యాపారులు రోడ్లపైకి వచ్చి విక్రయించకుండా సహకరించాలని వారిని కోరారు. త్వరలో రోడ్లపైన హద్దులు గీస్తామని హద్దులు దాటి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోలు, లారీలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయకుండా వారికి కూడ ఒక స్థలం కేటాయిస్తామని అట్టి స్థలంలోనే పార్కింగ్ చేయాలని సూచించారు.

## పీడీఎస్‌యూ తాండూరు డివిజన్ కమిటీ

తాండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ తాండూరు డివిజన్ నూతన కమిటీని మంగళవారం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా హెచ్.నవీన్, కార్యదర్శిగా చిన్నా, ఉపాధ్యక్షుడిగా కిరణ్, సహాయ కార్యదర్శిగా నర్మద, సభ్యుడిగా శ్రీకాంత్, మణికంఠ, అభిలాష్, వినయ్‌కుమార్, నవీన్, నిఖిల్ గౌడ్, అబ్దుల్‌నబీ, సుశాంత్‌లను ఎన్నుకున్నారు.

## 'అనురాగ్'లో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు


జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం జాతీయ ఫార్మసీ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. అనురాగ్ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం, ఎన్ఎస్ఎస్ స్వస్థ క్లబ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఫార్మసీ వారోత్సవాలను డీన్ స్కూల్‌ఆఫ్ ఫార్మసీ వసుధభక్తి అట్టహాసంగా ప్రాంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బ్లడ్ గ్రూప్ డిటెక్షన్ క్యాంప్‌లో 200మంది విద్యార్థులు పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర కుమార్, తిరుపతి, సంతోషి, ఫర్హానా, ఫార్మసీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు



తాండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ తాండూరు పట్టణ అధ్యక్షుడు నహీం, మాజీ కౌన్సిలర్ ముక్తార్నాజ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.